నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 31 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET




జూరాల ప్రాజెక్టు నుంచి 45 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

# జూరాలకు భారీగా వరద

- 45గేట్ల ద్వారా నీటి విడుదల

గద్వాల, ఆగస్టు 30 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జూరాలకు భారీగా వరదతో 3,21,000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. దీంతో ప్రాజెక్టు 45గేట్లు తెరిచి దిగువకు 3,31,047 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 8.300 టీఎంసీలుగా ఉన్నది. ఎడమ కాల్వకు 820, కుడికాల్వకు 620, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఐదు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా, విద్యుదుత్పత్తికి 19,288 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యాం 30 గేట్లు ఎత్తి దిగువకు 1,78,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టుకు మొత్తం అవుట్ ఫ్లో 3,31,047 క్యూసెక్కులు నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు.

**ఆల్మట్టి, నారాయణపూర్‌కు వరద**

అయిజ, ఆగస్టు 30 : ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 1,66,760 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 1,76,540 నమోదుకాగా ప్రాజె క్టు గరిష్ఠ నీటిమట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 122.10 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1,84,821, అవుట్ ఫ్లో 1,90,290 క్యూసెక్కులు కాగా, పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 32.02 టీఎంసీలుగా ఉన్నది. తుంగభద్రకు ఇన్‌ఫ్లో 31,159, అవుట్‌ఫ్లో 10,067 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 92.424 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్‌కు ఇన్‌ఫ్లో 3,291 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 2,650 ఉండగా ఆయకట్టుకు 641 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## నిండుకుండలా శ్రీశైలం

శ్రీశైలం, ఆగస్టు 30 : శ్రీశైలం జలాశయానికి శుక్రవారం 3,05,279 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో 10 గేట్లను పది అడుగుల మేర ఎత్తి 2,79,370.., కుడిగట్టు, ఎడమగట్టు విద్యుదుత్పత్తి ద్వారా 68,500 క్యూసెక్కులను విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టు నుంచి మొత్తం 3,47,870 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215 టీఎంసీలు కాగా.., ప్రస్తుతం 213.88 టీఎంసీలుగా ఉన్నది.

# అయ్యో పాపం..

- భూత్పూర్‌లో 11 నెలల బాలుడిని వదిలేసిన వైనం
- పోలీసులకు అప్పగించిన పారిశుద్ధ్య సిబ్బంది



వెల్ఫేర్ సొసైటీకి బాబును అప్పగిస్తున్న సిబ్బంది

భూత్పూర్, ఆగస్టు 30 : మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన కిరాణ దుకాణం వద్ద 11 నెలల బాలుడిని వదిలేసిన ఘటన చోటుచేసుకున్నది. అదే సమయంలో రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది బాలుడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ మొగుల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని చిల్డ్రన్స్ వెల్ఫేర్ వారికి సమాచారమిచ్చారు. వారు వచ్చి బాలుడిని సొసైటీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. బాబు వివరాలు తెలిస్తే 998 9712040 నెంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.


# కాల్వ కాదండోయ్.. రోడ్డే!

గట్టు, ఆగస్టు 30 : ఈ ఫొటోలో కనిపిస్తున్నది కాల్వ అని పొరబడకండి. గద్వాల జిల్లా గట్టు మండలంలోని చిన్నోనిపల్లి నుంచి అంతంపల్లికి వెళ్లే రోడ్డు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి తిరుగు జలాలు గ్రామంలోకి వస్తుండడంతో అంతంపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో ప్రజలు, రైతులు వ్యయప్రయాసాలు పడి మిట్టదొడ్డి మీదుగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. నీళ్లు లేకుంటే చిన్నోనిపల్లి నుంచి అంతంపల్లికి కొంత దూరం మాత్రమే ఉండగా, నీటి కారణంగా మిట్టదొడ్డి మీదుగా ఆరు కిలోమీటర్ల అధికంగా ప్రయాణం సాగించాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చిన్నోనిపల్లి-అంతంపల్లి రోడ్డుపై నిలిచిన నీరు

# వేపచెట్టుకు కల్లు..!



వేప చెట్టుకు కల్లు కారడాన్ని చూయిస్తున్న స్థానికులు

- బ్రహ్మంగారు చెప్పినట్లే జరుగుతుందంటున్న స్థానికులు
- తండోపతండాలుగా తరలివచ్చి ప్రత్యేక పూజలు

గట్టు, ఆగస్టు 30 : చాగదోణలో బోయ నాగేశ్ పశుగ్రాసం నిల్వ ఉంచే దొడ్డిలో వేపచెట్టు నుంచి కల్లు కారుతోంది. నాలుగు రోజుల నుం చి ఈ తంతు కొనసాగుతోంది. కాగా, వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంలో చెప్పినట్లే వేపచెట్టు నుంచి కల్లు కారుతోందని గ్రామస్తులు, స్థానికులు నమ్ముతున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు వేపచెట్టు వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇది దేవుడి మహిమగా చెప్పుకుంటున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



మహబూబ్‌నగర్ : ఆదర్శనగర్‌లో దివ్యాంగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# కదిలిన యంత్రాంగం

- ఆదర్శనగర్ బాధితులకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అండ
- సర్కారు తీరును ఎండగట్టడంతో 'మార్పు'
- దివ్యాంగులతో కలిసి కలెక్టర్‌తో సమావేశం
- పునరావాస కేంద్రం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే యెన్నం
- మద్దతుగా నిలిచిన పలు సంఘాల నేతలు



దివ్యాంగులతో కలిసి కలెక్టరేట్‌కు వస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 30 : మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆదర్శనగర్‌లో అక్రమ నిర్మాణాలంటూ రెవెన్యూ అధికారులు కూల్చిన దివ్యాంగుల ఇండ్ల సమస్యల పరిష్కారంలో కదలిక మొదలైంది. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దివ్యాంగులకు జరిగిన నష్టంపై ప్రభుత్వం, అధికార యంత్రాంగాన్ని నిలదీశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వెన్నంటి ఉంటానంటూ వారికి భరోసా కల్పించారు. పలు సంఘాలు సైతం దివ్యాంగులకు మద్దతుగా నిలిచేందుకు ముందుకొచ్చాయి. దివ్యాంగుల సమస్యలపై శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయిని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కలిసి సమస్యలను విన్నవించారు. నిరుపేదలైన దివ్యాంగులు కట్టుకున్న ఇండ్లను అక్రమ నిర్మాణాల పేరిట అధికారులు కూల్చివేశారని, ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. నకిలీ పట్టాలంటూ ఎంతో వ్యయప్రయాసాలకోర్చి కట్టుకున్న ఇండ్లను నేలమట్టం చేయడం అమానవీయమైన అంశంగా పరిగణించాలన్నారు. కనీస సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రిళ్లు పోలీసు బలగాల పహార మధ్య దుర్మార్గంగా అధికారులు వ్యవహరించాలని దివ్యాంగులు సైతం కలెక్టర్‌తో బాధను వెల్లిబుచ్చుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు.

**పెద్దలకో న్యాయం.. పేదలకో న్యాయమా?**

దివ్యాంగుల ఇండ్ల కూల్చివేతలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం ఎంతమాత్రం భావ్యం కాదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అధికారులు ఎలాంటి నోటీసులు లేకుండా ఇండ్లను కూలగొట్టారు. పైసలున్న వారికి నోటీసులు ఇచ్చి సమయం ఇస్తున్న అధికారులు పేదల విషయంలో అలా ఎందుకు వ్యవహరించలేదని మీడియా సమావేశంలో ప్రశ్నించారు. పట్టాలు నిజమైనవి కాకపోతే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలే తప్పా అర్ధరాత్రి వచ్చి బలవంతంగా బయటకు గెంటేసి కూల్చేస్తే వారు ఎక్కడికెళ్తారని నిలదీశారు. రూపాయి, రూపాయి కూడబెట్టుకొని ఇండ్లు కట్టుకుంటే వారి ఇండ్లను కూలగొట్టడం సరికాదన్నారు. మానవీయ కోణంలో ఆలోచన చేసి కూలగొట్టిన ప్రాంతంలోనే ఇండ్లు నిర్మాణం చేయడంతోపాటు తాత్కాలిక వసతి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఇండ్లు కూల్చిన స్థలంలోనే పునర్నిర్మించాలి**

ఇండ్లు కూల్చిన స్థలంలోనే పునర్నిర్మించి ఇవ్వాలని పాలమూరు అధ్యయన వేదిక, టీఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దివ్యాంగుల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. రాజకీయ చదరంగంలో పేదలను బలి చేస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. బాధ్యులైన అధికారులు, దళారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయ వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, వామన్‌కుమార్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయ్‌కుమార్, యాదగిరి, టీఎస్‌టీయూ నాయకులు గట్టన్న, జలాల్‌పాషా, బాలకృష్ణ, ఖుర్షీద్ తదితరులు సంఘీభావం తెలిపారు. దివ్యాంగుల పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

**శ్రీనివాస్‌గౌడ్ కుటుంబాన్ని బద్నాం చేస్తే ఖబడ్దార్..**

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తమకు అండగా ఉంటూ నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు పోరాటం చేస్తున్నారని దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మీడియాతో మాట్లాడారు. కొందరు శ్రీనివాస్‌గౌడ్‌ను బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిపై తాము కేసులు పెట్టడంతోపాటు మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అభాగ్యులకు అండగా ఉండటం తప్పా అని ప్రశ్నించారు. దివ్యాంగులకు మద్దతు తెలుపుతున్న వారి జోలికి వస్తే న్యాయపోరాటం ద్వారా వారికి తగిన బుద్ధి చెబుతామని బ్లైండ్‌లేమ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు.

**పునరావాస కేంద్రం ఏర్పాటు :** మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దివ్యాంగుల ఆందోళనతో ప్రజా పాలన ప్రభుత్వం దిగొచ్చింది. దివ్యాంగులకు మహబూబ్‌నగర్‌లోని అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## శాశ్వత పరిష్కారం చూపెడతాం : యెన్నం



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, ఆగస్టు 30 : తమ సమస్యలపై స్పందించాలంటూ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అష్ట కష్టాలు పడుతూ కళ్లు కన్పించక.. నడవడానికి రాక.. తినడానికి తిండిలేని కటిక దారిద్రంలో ఉం టూ కాసింత గూడు కట్టుకుందామనుకుంటే నకిలీ దస్త్రాలు, పట్టాలు అంటూ అధికారులు నిర్మాణాలు కూల్చేశారని వాపోయారు. ఈ విషయంపై స్పందించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పందించి.. శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మీరు తాసీల్దారు కార్యాలయంలో సమగ్ర వివరాలు అందించాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల పథకాల్లో మీకు ప్రాధాన్యత ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

### ఇందిరమ్మ ఇల్లంటూ పట్టా ఇచ్చిండ్రు..



మా నాన్న వేపూర్ రాజు దివ్యాంగుడు. 2007 సంవత్సరంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసుకోవాలంటూ పట్టా ఇచ్చారు. కూలీనాలీ చేసుకుం టూ పస్తులుండి రూ. 2లక్షలు అప్పు తెచ్చి ఇళ్లు నిర్మించుకుంటే నకిలీ ప ట్టా అంటూ నేలమట్టం చేశారు. పట్టా ఇచ్చింది మీరే అయినప్పుడు.. ఇచ్చేటప్పుడు తెలియలేదా నకిలీ పట్టా అని. ప్రభుత్వం మాకు న్యా యం చేయాలి.

– చాందీబాయి, రోహిత్ దంపతులు, ఆదర్శనగర్

### దివ్యాంగుల కేటగిరీ కింద ఇచ్చారు..



నా బిడ్డకు దివ్యాంగుల కేటగిరీ కింద ఇచ్చిన పట్టాతో ఇల్లు క ట్టుకుంటుంటే అధికారులు అకారణంగా కూల్చేశారు. నా బిడ్డకు తీవ్రంగా జ్వరం ఉండడంతో దవాఖానకు వెళ్లాం. మరుసటి రోజు వస్తే ఇళ్లు నేలమట్టం. నా భర్త కేశవులు పార పనిచేస్తాడు. పెద్ద బిడ్డ శ్రీవాణి డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమెకు కళ్లు కన్పించవు. చిన్న కొడుకుకూ కళ్లు కన్పించవు. గుడిసెలో బతుకెందుకంటూ ఈడ చిన్నగది వేసుకు ని తలదాచుకుందామంటే అన్యాయంగా కూల్చేశారు.

– చెన్నమ్మ, ఆదర్శనగర్

### కండ్లు కన్పించవు.. ఐనోళ్లు లేరు..



నాకు కళ్లు కన్పించవని ఇంట్లో వాళ్లు.. కట్టుకున్న పెళ్లాం కూడా వదిలేసింది. డిగ్రీ వరకు చదువుకున్న నేను సొంత ఊరు వదిలి సంఘం తరఫున సొంతంగా బతికేందుకు వచ్చి అప్పులు చేసి ఇంటిని నిర్మించుకుంటుంటే అడ్డుపడుతుండ్రు. చదువుకున్న సర్టిఫికెట్లు, సామగ్రి నేలమట్టమై ఇటుక పెళ్లల కింద నలిగిపోయాయి. నాకు దిక్కెవరురా దేవుడా. ప్రభుత్వం న్యాయం చేయకపోతే చావే శరణ్యం.

– పల్లి మల్లయ్య, ఆదర్శనగర్

### నన్ను, నా బిడ్డను వదిలించుకున్నారు..



నా భర్త, నాకు కళ్లు కన్పించవు. ముగ్గురు సంతానం. పుట్టిన బిడ్డకు కూడా కళ్లు కనిపించకపోవడంతో నా భర్త వదిలించుకున్నాడు. నా పెద్దబిడ్డ అంధురాలు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్స రం చదువుతున్నది. మా ఇద్దర్నీ పట్టించుకోకపోవడంతో చినజీయర్ స్వామి నేత్ర కళాశాలలో బిడ్డను చదివిస్తూ ఆమెకోసం ఇళ్లు కట్టుకుంటుంటే అధికారులు ఇట్లా చేశారయ్యా.

– కళమ్మ, ఆదర్శనగర్

# మాఫీ.. మాయ

- రోజుకోమాదిరిగా ప్రభుత్వ ప్రకటనలు
- కార్యాలయాల చుట్టూ తిరిగి రైతుల బేజారు
- బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు.
- సర్కార్ తీరుపై సర్వత్రా విమర్శలు
- రూ.2లక్షలకు పైగా రుణాల మాటేమిటి?

కల్వకుర్తి, ఆగస్టు 30 : రూ.2లక్షల రుణమాఫీ అంటూ గొప్పగా ప్రచారం చేస్తే నమ్మి ఓట్లేసి గెలిపించిన పాపానికి కాంగ్రెస్ నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు. మూడు విడుతలుగా బ్యాంకుల్లో పంట రుణాలున్న రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పినా గడువు అయిపోయినా కనీసం 40శాతం కూడా మాఫీ కాలేదు. అర్హులందరికీ చేయలేక ఇంటింటి సర్వే చేస్తామని కొత్త నాటకానికి తెరతీశారని, అర్హులైన రైతులను గుర్తించేదెప్పుడు, రుణమాఫీ అయ్యేదెన్నడని రైతులు వాపోతున్నారు.

**ఇంతకీ అర్హులైన రైతులంటే?**

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులు అంటే సరైన నిర్వచనమేమిటో చెప్పనేలేదు. మాములుగా భూమి సాగుచేసే ప్రతి వ్యక్తి రైతే. పట్టాదారు పాసు పుస్తకం ఉండి, బ్యాంకులో వ్యవసాయం చే సేందుకు పంట రుణం పొందిన ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిం ది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకు రుణమాఫీ చేస్తున్నామ ని ప్రకటించి మూడు విడుతలుగా చేస్తున్నామని గొప్పగా చెప్పి నా ఏ బ్యాంకులో చూసినా మాకు కాలేదంటే మాకు కాలేదం టూ రైతులు బారులుదీరిన ఘటనలే కనిపిస్తున్నాయి. రేషన్‌కార్డు లేనివారికి, ఐటీ కడుతున్న వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఇలా రకరకాల కారణాల వల్ల 60శాతం మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. రుణమాఫీ విషయంలో రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి, మంత్రులు కొత్త పల్లవి ఎత్తుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాలేదని, అర్హులైన రైతులను గుర్తిస్తామని కహానీలు చెబుతున్నారు. చివరకు వ్యవసాయాధికారులు రైతు కుటుంబాల సర్వే చేస్తారని, దరఖాస్తులను వ్యవసాయాధికారులకు ఇవ్వాలని ఉచిత సలహాలు ఇచ్చారు. విచిత్రమేమిటంటే రైతు నిర్ధారణ కోసం కుటుంబ సభ్యులు వివరాలు ఆధార్ నెంబర్‌తోసహా తీసుకోవడం విశేషం.

**రూ.2లక్షలకు పైగా రుణాలపై అయోమయం..**

కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన రైతు దంపతులు జనార్దన్‌రెడ్డి రూ.లక్షా 61వేలు, ఆండాలమ్మ రూ.లక్షా 61వేలు పంట రుణం ఎస్‌బీఐలో తీసుకున్నారు. వీరికి రేషన్ కార్డు ఉంది. వీరికి రుణామాఫీ కాలేదు. వ్యవసాయాధికారులను అడుగగా, రూ.2లక్షలకు పైగా రుణం ఉన్నందున మాఫీ కాలేదని చెప్పారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాన్ని బ్యాంకులో చెల్లిస్తే మాఫీ అవుతుందని చెప్పారు. ఇదే విషయమై సదరు దంపతులు బ్యాంకుకు వెళ్లి చెప్పారు. అలాంటి నిబంధనలేవీ మాకు రాలేదని బ్యాంక్ అధికారులు చెప్పారు. చేసేది లేక వెనుదిరిగారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణం మాఫీ చేస్తామని ప్రకటనలు చేస్తున్నా రైతుల్లో నమ్మకం లేదు. ఒకవేళ రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాన్ని చెల్లించాలని చెబితే అసలే పెట్టుబడుల కాలం, ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని ప్రశ్నిస్తున్నారు.

**కాలాయాపన కోసమే రైతు సర్వే..**

ప్రభుత్వం రైతు రుణమాఫీకి ఫుల్‌స్టాప్ పెట్టేందుకే రైతు సర్వేకు స్వీకారం చుట్టిందని రైతు సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ సర్కార్ రుణమాఫీ చేసినప్పుడు ఇవేవీ అడ్డంకులు పెట్టలేదని, కాంగ్రెసోళ్లు కొర్రీలు పెట్టి రైతులను ముప్పతిప్పలతో మూడు చెరువుల నీళ్లు తాపుతున్నారని వాపోతున్నారు. రుణమాఫీ ముసుగులో రైతుబంధుకు చరమగీతం పాడారని, ఇప్పుడు రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులకు ఎనలేని ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతుల పాపం ఊరికే పోదంటూ శాపనార్థాలు పెడుతున్నారు.



కల్వకుర్తి ఎస్‌బీఐ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

# మార్పంటే ఇదేనా..?

- మానవత్వం లేకుండా ఇండ్లు కూలుస్తారా
- రాజకీయాలకతీతంగా స్పందించాలి : శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 30 : కాంగ్రెస్ సర్కారు మార్పు అంటే ఏదో అనుకున్నామని.. పేదోళ్ల కడుపుకొట్టడమే మార్పా అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. పాలమూరులో దివ్యాంగులు కట్టుకున్న ఇండ్లు అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేసిన ఘటనపై ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి సమీపంలోని ఆదర్శనగర్‌లో దివ్యాంగులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పాలమూరులో జరుగుతున్న ఘటన అత్యంత దుర్మార్గమైనదిగా అభివర్ణించారు. ప్రభుత్వం స్పందించేదాకా తాము విశ్రమించేదని హెచ్చరించారు. దివ్యాంగులకు జరిగిన నష్టం మరొకరికి జరగకుండా చూడటం మా బాధ్యతన్నారు. సర్వం కోల్పోయి జీవచ్ఛవంగా బతుకీడుస్తున్న దివ్యాంగులను ముట్టుకోవాలని చూస్తే మాడిమసైపోతారని హెచ్చరించారు. తిరిగి వారికి ఇండ్లు కట్టించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. చెవులు విన్పించవు.. మాటలు రావు.. కళ్లు లేవు.. కాళ్లు లేవు.. ఒక్కొక్కరిది ఒక్కో గాథ. వీరిని చూస్తేనే బాధ అన్పిస్తొంది. అలాంటి వాళ్లను భయభ్రాంతులకు గురిచేసి ఇండ్లు ఎలా కూలగొట్టాలన్పించిందని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ఈ ప్రభుత్వానికి ఇంత కూడా కనికరం లేకపాయేనా అని ప్రశ్నించారు. పదేండ్లు కష్టపడి ఊరుబాగు చేసినం.. కరోనాలోనూ మందులు పంపించి.. పేదలను కడుపులో పెట్టుకుని కాపాడుకున్నాం. ఇప్పుడు గొప్పలు మాట్లాడేటోళ్లు కరోనాలో ఎవరూ రాలే. ఇయ్యాల దివ్యాంగులను పలకరించాలని వస్తే.. అవాకులు చవాకులు మాట్లాడుతున్నారన్నారు. ఎవరేమనుకున్నా ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. నాలుగు దిక్కులా డబుల్‌బెడ్రూం ఇండ్లు కట్టినం. ఈసారి అధికారమిచ్చింటే దివ్యాంగులందరికీ ఇండ్లు కట్టించి ఇచ్చేటోళ్లమన్నారు. మార్పు అంటే ఇండ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. పాలమూరులో జరిగిన ఈ ఘటనను ఎవరూ రాజకీయ కోణంలో చూడొద్దని, మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. దివ్యాంగుల కోసం కాళ్లు మొక్కడానికైనా సిద్ధమని, వారికి అందరూ అండగా నిలవాలని కోరారు.

**నష్టం జరిగిందంటే వగలేడుపా..?**

దివ్యాంగులకు నష్టం జరిగిందంటే శ్రీనివాస్‌గౌడ్ వగలేడుపు ఏడుస్తున్నాడని పైసకు కొరగానోళ్లు అంటున్నారు. మీ కుటుంబంలో ఇలా ఎవరికైనా జరిగితే ఆ బాధ ఏందనేది తెలుస్తది. నోరుంది కదాని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదని హెచ్చరించారు. గవర్నమెంట్ ఇండ్లు కట్టించి ఇవ్వకపోతే.. మేమే అడుక్కొచ్చి అయినా సరే ఇండ్లు నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. బస్టాండ్‌కు పోయి ఇగో మా ఇళ్లు గవర్నమెంట్ కూలగొట్టింది.. తలా ఇంత సాయం చేయండయ్యా అని అడుక్కుంటామని మాజీ మంత్రి చెప్పడంతో దివ్యాంగులు కన్నీరు పెట్టుకున్నారు. లీడర్లంతా తలా ఇంత సాయం చేయమని అడుగుతాం.. మీకు గూడు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఉట్టిగ తెలంగాణ తెచ్చుకోలే. పేదోళ్ల ఇండ్ల కాడ రాజకీయం చేయొద్దు. 2007లో దివ్యాంగుల కాలనీ ఇది. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిచ్చింది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్, నీళ్లు ఇచ్చి.. రూ.4వేల పింఛన్ ఇచ్చినం. పింఛన్ పైసలు రూపాయి, రూపాయి కూడబెట్టుకొని ఇల్లు కట్టుకుంటే నిర్దాక్షిణ్యంగా రాత్రికి రాత్రి కూలగొట్టి రోడ్డున పడేశారన్నారు. కూల్చిన ప్రతి ఒక్కరికి ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నారు.